క్లుప్తంగా

సుకుమారన్ మృతి పార్టీకి తీరని నష్టం



సుకుమారన్‌కు నివాళులు అర్పిస్తున్న సీపీఐ శ్రేణులు

అల్లిపురం: సీపీఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకుడు, విశాఖ పట్నం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు టి.ఎస్. సుకుమారన్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహమాన్ అన్నారు. శనివారం అల్లిపురం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సుకుమారన్ సంస్మరణ సభలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యాంజనేయ, చంద్రశేఖర్, మన్మథరావు, వనజాక్షి, శ్రీనివాస రావు, క్షేత్రపాల్, కాసులరెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు చేపట్టారు..

సాక్షి ఎఫెక్ట్..

దాబాగార్డెన్స్: 'ముందు చూపు లేకుంటే ముప్పే' పేరిట 'సాక్షి' శనివారం ప్రచురించిన కథనానికి ప్రజారోగ్యశాఖ స్పందించింది. కర్రలదొడ్డి, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాల్లో వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయని.. 'సాక్షి' కథనానికి సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీ, పబ్లిక్ హెల్త్ విభాగం స్పందించి కాలువలో పూడికలు తీసి, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. చెత్తను వాహనాల ద్వారా తరలించినట్లు జోన్-4 ప్రజారోగ్యాధికారి తెలిపారు.

ఘనంగా రెప్‌కో బ్యాంక్ వార్షికోత్సవం



బ్రాంచ్ మేనేజర్ రవికుమార్‌ను అభినందిస్తున్న ఖాతాదారులు

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటైన రెప్‌కో బ్యాంక్ 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రామాటాకీస్ ప్రాంతంలోని బ్యాంక్ బ్రాంచ్‌లో బ్రాంచ్ మేనేజర్ యల్లపు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు ఖాతాదారులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి స్వీట్లు పంపిణీ చేశారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం నిర్వహించిన తులసిపూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ సన్నిధిలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ, ఈవో సురేష్‌బాబా తదితరులు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నప్రసాదాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎమ్మెల్యే వంశీ కృష్ణ, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమారు 6 వేల మందికి అన్నసమారాధన చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎర్నిమాంబ అమ్మవారి మారువారం నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆయా గ్రామాల ప్రతినిధులు, సేవా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చావులమదుం జంక్షన్‌లో గోతులు పడిన రోడ్డు

రాజారామ్మోహన్‌రాయ్ ప్రధాన రోడ్డు మధ్యలో ఇలా..

చావులమదుం జంక్షన్‌లో పాడైన రోడ్డు

రహదారుణాలు

- శిథిలమైన రోడ్లతో పాదచారులు, వాహన చోదకుల ఇక్కట్లు
- ఉగాది నాటికి అద్దంలా రోడ్లను మెరిపించేస్తామని కూటమి నేతల హామీ
- గెలిచాక పట్టించుకోని వైనం



నౌరోజీ రోడ్డు (ఏపీఎస్‌ఈబీ ఎస్‌ఈ కార్యాలయం పక్క రోడ్డు) ఇలా..



జీవీఎంసీ 35వ వార్డులో అధ్వానంగా ఉన్న పాత బస్టాండ్ రోడ్డు



రెల్లివీధి రోడ్డు ఇలా..



ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు పరిస్థితి ఇదీ

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావచ్చింది. అయినప్పటికీ శిథిలమైన రహదారుల మరమ్మతుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదనడానికి పలు ప్రాంతాల్లో గుంతలు పడి.. పగుళ్లదేరి.. రాళ్లు తేలిన రోడ్లే ఉదాహరణగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన ఐదారు నెలల తర్వాత ప్యాచ్ వర్క్‌లు చేసి మమా అనిపించేశారు. ఇప్పుడా రోడ్లు దారుణంగా మారాయి. ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గోతులతో నెలల తరబడి వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిన్నచిన్న గోతులను జూమ్ చేసి బూతద్దంలో చూపించి రహదారుల నిర్వహణపై దుష్ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఉగాది నాటికి గుంతలు పూడ్చేస్తామని హామీ ఇచ్చారు. ఉగాది వెళ్లి నెలలు గడుస్తున్నా రహదారుల నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారించలేదు. నియోజకవర్గ పరిధి అల్లిపురం, బౌడారా రోడ్డు, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్ కొత్తరోడ్డు, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, పోలీస్ క్లబ్ ప్రాంతం, నౌరోజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మధ్యలో ఉన్న గోతులతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా కాలంగా రోడ్డు మధ్యలో ఉన్న గోతుల కారణంగా ఇబ్బంది పడుతున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు శిథిలమైన రోడ్లకు మరమ్మతు చేయాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

మధ్యలో ఆగిపోయిన నిధులు..



వైఎస్సార్‌సీపీ హయాంలో టర్నర్ చౌల్ట్రీ వరకు నిర్మించిన రహదారి

జగదాంబ: ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి దూరంగా ఉన్న పాతనగరం అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కోట్లు వెచ్చించింది. ముఖ్యంగా ఇక్కడి శిథిలమైన రహదారి విస్తరణకు రూ. 12 కోట్లు విడుదల చేసింది. దీంతో రహదారులు, ఫుట్‌పాత్‌లు, కల్వర్టుల నిర్మాణం ప్రారంభమయింది. అయితే పనులు జరుగుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. బిల్లులు ఆగిపోవడంతో జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు జరగాల్సిన రహదారి విస్తరణ ఏవీఎన్ కళాశాల డౌన్ వరకు మాత్రమే జరిగింది. ఆ తర్వాత నిర్మాణం ఆపేశారు. దీని వల్ల వన్‌టౌన్ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండ్ రోడ్డు శిథిలమైనా దాన్ని గాలికి వదిలేశారు. ఏవీఎన్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు అత్యధికులు వాడే ఈ రహదారి అభివృద్ధిని మరిచిపోయారు.



సౌత్ జైలురోడ్డులో భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద ప్రమాదకరంగా మారిన గొయ్యి

పలు వార్డుల్లో దయనీయంగా రహదారులు..

అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ ఏడాది ఉగాది నాటికి రోడ్లకు మరమ్మత్తులు చేపట్టడం, కొత్త రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలకు హామీలు గుప్పించారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాత్రికి రాత్రి కొన్ని రోడ్లు నిర్మించినప్పటికీ, కొన్ని రోడ్లు ఇప్పటికీ వేయక పోవటంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ 32, 33, 34 వార్డుల్లో కొన్ని రోడ్లు గోతులమయంగా మారాయి.

జర్నలిస్టుల పిల్లల ఫీజుకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ప్రజా ఫోకస్ రిపోర్టర్ భాష కుమార్తె కళాశాల ఫీజు కోసం రూ.5 వేలు, మరో ప్రముఖ జర్నలిస్ట్ పాప స్కూల్ ఫీజుకి రూ.5 వేలు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించాలని తోచిన ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోరుతూ నిరంతరం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులు చాలీ చాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వారికి కనీసం అక్రిడేషన్ వంటి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేకపోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల ముందు జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని వాసుపల్లి కోరారు. లేనిచో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల కల్పనకు డిమాండ్



ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

దాబాగార్డెన్స్: నూతనంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సరైన పరీక్షలు నిర్వహించకుండా మార్చడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని, తక్షణం ఆ ఇబ్బందులు తొలగించి పెన్షనర్లు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం దాబాగార్డెన్స్ వెల్నెస్ సెంటర్ వద్ద సీజీహెచ్‌ఎస్ సమస్యలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా దేశానికి సేవ చేసి, పదవీ విరమణ పొందిన పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలతో మోదీ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని ఆరోపించారు. గత ఏప్రిల్ నుంచి నేటి వరకు దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందే విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత నెల వరకు ఎన్‌ఐసీ మాడ్యూల్లో అందిస్తున్న వైద్య సేవలను సిడాక్ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చారని, కొత్త మాడ్యూల్ సక్రమంగా పని చేయకపోవడం వల్ల దేశవ్యాప్తంగా వైద్య సేవలు పడకేశాయని తెలిపారు. సరైన చర్యలు చేపట్టకుండా ఇప్పుడు ఆకస్మాతుగా సాఫ్ట్‌వేర్ మార్చి వైద్య సేవలకు ఇబ్బంది కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రశేఖరరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన రోగులు లక్షలాది రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ శ్యామ్‌కిషోర్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, గతంతో పోలిస్తే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, త్వరలోనే మిగిలిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం జరుగుతుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామ్మకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంఆర్‌డీ రాజు, రామకృష్ణ, ఆర్. సత్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిని పునఃసమీక్షించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు

అల్లిపురం: వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వార్డు అడ్మిన్ సెక్రటరీల పదోన్నతులపై సమీక్షించాలని వార్డు ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు గ్రామ, వార్డు సచివాలయ శాఖామంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, హోమ్ మినిస్టర్ అనితకు వినతి పత్రం అందజేశారు. వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు వార్డు అడ్మిన్ సెక్రటరీగా పదోన్నతి పొందడం వల్ల రిటైర్మెంట్ నాటికి కనీసం జూనియర్ అసిస్టెంట్ అయ్యే అవకాశాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ అర్హతతో నియామకం కాబడిన వారికి మిగతా వారితో పోల్చి చూస్తే అత్యల్పంగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిపాదించిన పదోన్నతిలో గల లోపాలను సరిదిద్దాలని ఐక్య కార్యచరణ సమితి ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, సభ్యులు, ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీల సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేణుక, వెంకట్, వెంకట్ కుమార్, నాని, జగన్నాథరావు, యశ్వంత్ తదితరులు కోరారు.

మోసాలకు పాల్పడుతున్న నకిలీ స్వచ్ఛంద సంస్థలు

దాబాగార్డెన్స్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థల గుర్తింపులో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఏ విధమైన సేవలు ఎవరు చేయొచ్చనే పటిష్ట చర్యలు రూపొందించకపోవడంతో ఎన్నో సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, వాటిలో నకిలీ స్వచ్ఛంద సంస్థలు మహిళలు, అమాయకులైన గిరిజనులను మోసం చేస్తున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కౌన్సిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక రాష్ట్రాల్లో కులాలు, మతాల పేరిట విద్యా, వైద్య సంస్థలు వెలిశాయని, కానీ నేరాలు జరిగి పత్రికల్లో వచ్చిన తర్వాత ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొన్ని సంస్థలు వినియోగదారుల హక్కులు, పర్యావరణ హక్కులు, మానవ హక్కులంటూ ప్రభుత్వం నుంచి గుర్తింపు లేకపోయినా, అమాయకులను మోసం చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు, యువకుల్లో మానవ హక్కులు, పర్యావరణ హక్కులు, మహిళలు, బాలల హక్కులు, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడమే మానవ హక్కుల కౌన్సిల్ ఆశయమని చెప్పారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సమావేశంలో విద్యార్థులు, గుర్తింపు కార్డుతో వచ్చిన వారి వివరాలు పరిశీలించి, హక్కుల పరిరక్షణకు కృషి చేసే వారిని గుర్తించి, పోలీస్ ఉన్నతాధికారుల అనుమతితో జూలై 12న నిర్వహించనున్న 26వ వార్షికోత్సవానికి ఆహ్వానించనున్నట్లు తెలిపారు. మానవ హక్కుల కౌన్సిల్ పేరిట నమోదైన వాట్సప్ గ్రూప్‌లతో తమ సంస్థకు సంబంధం లేదని, ఉన్నత న్యాయస్థానానికి ఫిర్యాదు దాఖలు చేస్తామన్నారు.

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం



సభలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ (క్రైం) డి.లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

దాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ద్వారకాబస్ స్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, తొలగించిన రెండు వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్షంలో ఉంటూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్రమోదీ కాళ్లు మొక్కుతున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: వైశాఖ మాసం ఆఖరి శనివారం కావడంతో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో మామిడి పండ్లు సమర్పించుకున్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాలు చేస్తున్న స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు శనివారం ఉదయం ఆర్కే బీచ్ వద్ద ఆహ్లాదకర వాతావరణంలో సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం రుషికొండ బీచ్‌లో కూచిపూడి డ్యాన్స్ అభినయించారు. భక్తిశ్రద్ధలతో గాయత్రి హోమం నిర్వహించారు. రామ నామంతో సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ కూచిపూడి డ్యాన్స్, గాయత్రి హోమం కేవలం సంస్థ ఆవరణలోనే కాకుండా, ఇలా ప్రకృతి ఒడిలో ప్రకృతి మాత ఆశీస్సులతో విద్యార్థులు ఆనందంగా, మానసికోల్లాసంతో చక్కగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ట్యూషన్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.